వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి, పాల్గొన్న ఎస్పీ, అధికారులు

గ్రామ పరిపాలన పద్ధతి ప్రకారం జరుగాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ, సెప్టెంబర్ 10:గ్రామ పరిపాలన పద్ధతి ప్రకారం జరుగాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఆయా మండలాల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ శరత్ చంద్రతో కలిసి మాట్లాడారు. అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో వినాయక నిమజ్జన ఏర్పాట్లు ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలన్నారు. ఆర్డీఓలు, డీఎస్పీల సహకారంతో కావాల్సిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై రాజీ ప్రసక్తే లేదని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యటించి అన్ని అంశాలను పరిశీలించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నాటిన మొరకరలే బతికేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చిట్యాలలో ఉపాధ్యాయుల మధ్య సఖ్యత లేకపోవటంతో హెచ్‌ఎంకు మెమో జారీ చేయాలని డీఈఓను ఆదేశించారు. చందంపేట మండలం పోలేపల్లి పంచాయతీ కార్యదర్శి అందుబాటులో లేనందున సస్పెండ్ చేయాలని, ఎంపీడీఓ, ఎంపీఓల పర్యవేక్షణ కొరవడినందున వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీపీఓ, జడ్పీ సీఈఓలను ఆదేశించారు. అవెన్యూ ప్లాంటేషన్ సరిగ్గా లేనందున వేములపల్లి ఎంపీడీఓ, ఎంపీఓలకు కూడా నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఎస్పీ శరత్‌చంద్ర మాట్లాడుతూ గణేశ్ నిమజ్జనం జరిగే ప్రాంతాలను ఆర్డీఓ, డీఎస్పీలు సందర్శించి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పూర్ణచంద్ర, శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వసతులు కల్పిస్తాం

రామగిరి : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠకులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టర్ గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే వారి కోసం లైబ్రరీ సమయాన్ని మహిళలకోసం రాత్రి 9, పురుషుల కోసం 10గంటల వరకు పొడిగించాలని లైబ్రరియన్ నాగయ్యను ఆదేశించారు. గ్రంథాలయానికి తక్షణమే 20 ర్యాక్‌లు, 100 రైటింగ్ ప్యాడ్‌లు ఏర్పాటు చేయాలని సీసీని ఆదేశించారు.

ఐలమ్మ పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకం

- మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి
- జిల్లా వ్యాప్తంగా చాకలి ఐలమ్మ వర్ధంతి

చందంపేట, సెప్టెంబర్ 10 : తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన పోరాట పటిమ స్ఫూర్తిదాయకమని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని దేవరకొండలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 14వ వార్డులోని వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేముల రాజు, కృష్ణ, నాయకులు చంద్రమౌళి, బాబా, పొట్ట మధు, వేణుగౌడ్, ఇలియాస్ పటేల్, వడ్త్య బాలు, అఫ్రోజ్, రాములు, లక్ష్మణ్, జమీర్ బాబా, లక్ష్మీకాంత్, లోకేశ్, శివ పాల్గొన్నారు.

దేవరకొండ: ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న రవీంద్రకుమార్

ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

నల్లగొండలో..

నల్లగొండ రూరల్, సెప్టెంబర్ 10: చాకలి ఐలమ్మ జీవితం భావి తరాలకు స్ఫూర్తి దాయకమని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సాగర్ రోడ్డులో ఉన్న రజక భవన్ ఆవరణంలో నిర్వహించిన ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణలో భూస్వాములు, పెత్తందార్లకు వ్యతిరేకంగా ఆత్మగౌరవ పోరాటం చేసిన వీరనారి ఐలమ్మ అన్నారు. రజక సంఘాల సమితి ముఖ్య సలహాదారుడు కొండూరు సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రజక భవన నిర్మాణం ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నాయకులు పిల్లి రామారాజు, బీసీ సంక్షేమ సంఘాల అధ్యక్షుడు చక్రహరి రామరాజు, దుడుకు లక్ష్మీనారాయణ ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గీతకార్పొరేషన్ మాజీ చైర్మన్ కటికం సత్తయ్యగౌడ్, బీసీ సంఘాల నాయకులు నేలపట్ల సత్యనారాయణ, మల్లయ్య, ఐతగోని జనార్దన్, వెంకటేశ్వర్లు, బోనగిరి దేవేందర్, పగిళ్ల సైదులు, ఆమంచి ఆంజయ్య, చిలుక రాజు చెన్నయ్య,

వెంకన్న, సతీశ్, భీమనపల్లి నగేశ్, శ్రీను, సట్టు శంకర్ పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

రామగిరి : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి సీపీఎం నాయకులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బండ శ్రీశైలం, సయ్యద్ హాషం, లక్ష్మీనారాయణ, సలీమ్, కోట్ల అశోక్‌రెడ్డి, పద్మ పాల్గొన్నారు.

ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, సెప్టెంబర్ 10: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చిట్యాల ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం ఐలమ్మ వర్ధంతి సందర్భంగా రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పట్టణంలోని సాగర్‌రోడ్డులో ఉన్న ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, రజక సంఘం నాయకులు దోసపాటి రవి, యాదగిరి, దుర్గయ్య, సుధాకర్, ఎల్లయ్య, పొదిల బ్రహ్మం, నారాయణ పాల్గొన్నారు.

మర్రిగూడలో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రజక సంఘం, వివిధ పార్టీల నాయకులు

నకిరేకల్ : ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

హాలియాలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

నల్లగొండ రూరల్ : ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

14 మైలు రాయివద్ద వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, అడిషనల్ ఎస్పీ రాములునాయక్

హాలియా, సెప్టెంబర్ 10 : అనుముల మండలం 14వ మైలురాయి అలీనగర్ వద్ద సాగర్ ఎడమ కాల్వలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి అనుకూలంగా ఉందని, అందు కు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం అలీనగర్ వద్ద నిమజ్జన ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, అడిషనల్ ఎస్పీ రాములునాయక్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా చూడాలని, భారీ విగ్రహాల నిమజ్జనానికి వీలుగా భారీ క్రేన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లైట్లు, తాగునీరు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ యడవల్లి అనుపమా నరేందర్‌రెడ్డి, కమిషనర్ రామదుర్గారెడ్డి, తాసీల్దార్ జయశ్రీ, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

విద్యార్థినుల రక్షణ కోసమే షీటీమ్ : డీఎస్పీ రాజశేఖర్‌రాజు

కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాజశేఖర్

మిర్యాలగూడ, సెప్టెంబర్ 10: విద్యార్థినుల రక్షణ కోసమే షీటీమ్ పని చేస్తున్నదని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని మినా మహిళ ఇంజినీరింగ్ కళాశాలలో ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థినులకు షీటీం ఆధ్వర్యంలో సైబర్ నేరా లు– సోషల్ మీడియా ప్రభావంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థినులు ఆపదలను ముందుగానే పసిగట్టి పోలీసులకు సమాచారం అందిస్తే పోలీసులు రక్షణ కల్పిస్తారన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి వాటికి యువత దూరంగా ఉండాలని సూచించారు. ప్రమాద సమయంలో 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, ప్రయాణం చేసేటప్పుడు టీ సేఫ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ గోల్స్ సెట్టింగ్ అండ్ అచీవ్‌మెంట్‌పై విద్యార్థినులకు వివరించారు. కళాశాల చైర్మన్ ఎండీ.మహమూద్‌అలీ, సీఐలు కరుణాకర్, నాగరాజు, షీ టీం మేనేజర్ తబిత, డైరెక్టర్ షహలాబుతుల్, వైస్ ప్రిన్సిపాల్ వాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు : ఏడీఏ

దామరచర్ల, సెప్టెంబర్ 10: ఎరువులను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ దేవ్‌సింగ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌తో పాటు పలు ఎరువుల దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ పాస్ యంత్రాల ద్వారానే ఎరువుల విక్రయాలు జరుపాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై పీడీయాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం రైతువేదికలో రుణమాఫీపై రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఏఈఓలు రమావత్ పార్వతి, అజ్మీరా సైదులు, పీఏసీఎస్ సీఈఓ వెంకటరెడ్డి ఉన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

నల్లగొండ రూరల్, సెప్టెంబర్ 10: అధికారులు, సిబ్బంది విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నల్లగొండ మండల ప్రత్యేకాధికారి ఖాద్రీ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మండలస్థాయి అధికారులతో కలిసి పలు అంశాలను తనిఖీ చేశారు. గ్రామంలో పారిశుధ్య పనులు, అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ ఎస్.వెంకట్‌రెడ్డి, ఎంపీఓ ముజీబొద్దీన్, పంచాయతీ కార్యదర్శి ఫారూక్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ పోయినది
మైనంపాటి రమ్య W/o. ప్రదీప్ రెడ్డి, R/o. బ్రాహ్మణ కళ్యాణమండపం దగ్గర, శ్రీరాంనగర్, సూర్యాపేట Town & Dist. అను నాయొక్క ఒరిజినల్ లింకుడాక్యుమెంట్ (నెం.1012/2003) శ్రీరాంనగర్ నుండి కొత్త బస్టాండ్, సూర్యాపేట బైక్ పైన ప్రయాణిస్తుండగా పోయింది. దొరికినవారు సంప్రు॥ 9666657412

WANTED
★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం 16 K to 18K, ఏజెంట్ కమిషన్ 6K Ph: 9640258899/9640468899.
NT-331762

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777196	చౌటుప్పల్ : 9182777638

12, 18 తేదీల్లో ఎంజీయూలో పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు

రామగిరి, సెప్టెంబర్ 10: మహాత్మాగాంధీ యూనివర్సిటీ నిర్వహించిన పీహెచ్‌డీ ఎంట్రెన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ ఆకుల రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ అభ్యర్థులకు, 18న కామర్స్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. మిగిలిన సబ్జెక్టుల వారికి త్వరలో తేదీలు ప్రకటిస్తామని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు నెట్, సెట్, ఇతర అర్హతల పత్రాలను వెంట తీసుకు రావాలని సూచించారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి పరామర్శ

కట్టంగూర్, సెప్టెంబర్ 10 : మండలంలోని అయిటిపాముల గ్రామానికి చెందిన గండమల్ల మధు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బొల్లేపల్లి గ్రామానికి చెందిన ఎర్ర బక్కయ్య, మల్లారం గ్రామానికి చెందిన రాంబాబు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మంగళవారం బాధిత కుటుంబాలను వేర్వేరుగా పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ తరాల బలరాములు, మాజీ సర్పంచ్ దాసరి సంజయ్‌కుమార్, నాయకులు పెద్ది మల్లేశ్, బెల్లి సుధాకర్ ఉన్నారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు : ఎంఈఓ

గుర్రంపోడ్, సెప్టెంబర్ 10: మండల స్థాయి బాల బాలికల క్రీడా పోటీలు బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు ఎంఈఓ తరి రాములు అన్నారు. మంగళవారము ఎంఆర్సీ భవనంలో విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఉదయం 9 గంటలకు క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని, పోటీల్లో విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని సూచించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబర్10 : మండలంలోని కిష్టాపురం గ్రామంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని అదే గ్రామానికి చెందిన పల్ల సైదమ్మ(55) మృతి చెందింది. రూరల్ ఎస్ఐ సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సైదమ్మ గణేశ్ విగ్రహ నిమజ్జన కార్యక్రమానికి హాజరై రాత్రి 12 గంటల సమయంలో అద్దంకి– నార్కట్‌పల్లి రహదారి వెంట నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా దామరచర్ల నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఆమెను వెనుక నుంచి ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సైదమ్మను స్థానికులు 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి కుమారుడు విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

కట్టంగూర్, సెప్టెంబర్ 10 : ప్రతి గ్రామంలో పారిశుధ్యం, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి కోటేశ్వర్‌రావు ఆదేశించారు. మంగళవారం మండలంలోని పరడ గ్రామాన్ని సందర్శించి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లతో సమావేశమై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్ రావు, ఏపీఓ కడెం రామ్మోహన్, ఏపీఎం కస్పరాజు సైదులు, పీఆర్ ఏఈ జమీల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం


బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే నోములభగత్

- మాజీ ఎమ్మెల్యే భగత్‌కుమార్

హాలియా, సెప్టెంబర్ 10 : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. ఇబ్రహింపేట గ్రామానికి చెందిన ఆవుల వెంకన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడికి బీఆర్ఎస్ పార్టీ బీమా కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కును మంగళవారం మృతుడి ఇంటికి వెళ్లి అందించారు. అధికారంలో ఉన్నా లేకున్నా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, వాటి అమలు కోసం పోరాటం చేస్తామన్నారు. అనంతరం 1వ వార్డులో శ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద నోముల భగత్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఆప్కాబ్ చైర్మన్ యడవల్లి విజయేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు చాపల సైదులు, నాయకులు సురభి రాంబాబు, మహేశ్, శంకర్, లక్ష్మయ్య, జగదీశ్,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుంటిగొర్ల పాపయ్య, మాజీ సర్పంచ్ వెంకట్రాంరెడ్డి ఉన్నారు.

చదువులో విద్యార్థులు ముందుండేలా చూడాలి

- డీఈఓ భిక్షపతి

త్రిపురారం : మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

హాలియా/త్రిపురారం, సెప్టెంబర్ 10 : ప్రభుత్వ పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థికి చదవడం, రాయడంతో పాటు చతుర్విత ప్రక్రియల్లో ప్రావీణ్యం సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ బొల్లారం భిక్షపతి సూచించారు. అనుముల మండలంలోని చల్మారెడ్డిగూడెం, కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, త్రిపురారం మండలంలోని కంపసాగర్ ఆదర్శ పాఠశాల, కేజీబీవీని మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈవో బాలూనాయక్, హెచ్‌ఎంలు దాస వెంకన్న, ప్రకాశ్ సరిత, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల, కేజీబీవీ ప్రత్యేకాధికారి విజయలక్ష్మి ఉనారు.

డీ-40 మైనర్ కాల్వకు గండి


కాల్వకు గండి పడడంతో పొలాల్లో నిలిచిన నీరు

తిప్పర్తి, సెప్టెంబర్10 : మండలంలోని ఎర్రగడ్డల గూడెం గ్రామ శివారులో డీ40–11/ఎల్ మైనర్ కాల్వకు మంగళవారం గండి పడింది. దాంతో పంట పొలాల నుంచి నీరు వెళ్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఏఈ శివప్రసాద్ గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. కాల్వ కింది రైతులు స్థాయికి మించి గేటును లేపడంతో కాల్వ ఓవర్‌ఫ్లో కారణంగా పాక్షికంగా గండి పడిందన్నారు. నీటిని నిలిపివేసి మరమ్మతు చేస్తున్నట్లు చెప్పారు. పనులు పూర్తయిన తర్వాత నీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం : డీపీఓ మురళి

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీఓ మురళి

మునుగోడు, సెప్టెంబర్10 : పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉండొచ్చని, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని డీపీఓ, మండల ప్రత్యేకాధికారి మురళి, సూపర్‌వైజర్ నాగమణి సూచించారు. మండల పరిధిలోని ఇప్పర్తి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పోషణ మాసోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు, పప్పులు, పాలు ఉడికించిన కోడిగుడ్లు తీసుకోవాలన్నారు. అంతకు ముందు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ స్వరూపారాణి, పంచాయతీ కార్యదర్శి లింగస్వామి, అంగన్‌వాడీ టీచర్లు శంకరమ్మ, ధనలక్ష్మి, సుజాత, మంజుల, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి పేదలకు వరం :ఎమ్మెల్యే బాలూనాయక్

కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట(దేవరకొండ), సెప్టెంబర్ 10 : పేదింటి ఆడ బిడ్డల పెండ్లికి ప్రభుత్వం అందిస్తున్న కల్యాణలక్ష్మి పథకం వరమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. పది మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం దేవరకొండలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ సంతోశ్‌కిరణ్, మాజీ ఎంపీపీలు జాన్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మాజీ చైర్మన్ వడ్త్య దేవేందర్‌నాయక్, నాయకులు లోకసాని శ్రీధర్‌రెడ్డి, పున్న వెంకటేశ్వర్లు, హనుమంతు వెంకటేశ్‌గౌడ్, హరికృష్ణ, కొర్రరాంసింగ్‌నాయక్, శిరందాసు కృష్ణయ్య, వెంకటయ్యగౌడ్, సైదులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే

నిడమనూరు, సెప్టెంబర్ 10 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన వారందరికీ పథకాలను అందిస్తున్నదని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. మండలానికి చెందిన 44 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆయన అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.2 లక్షలకు పైగా రుణాలున్న రైతులకు సైతం రుణమాఫీ త్వరలో వర్తిస్తుందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిందని, త్వరలో బస్సుల సంఖ్య కూడా పెంచుతారన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎంపీడీఓ గుర్రం వెంకటేశం, డీసీసీబీ డైరెక్టర్ విరిగినేని అంజయ్య, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అంకతి సత్యం, మాజీ జడ్పీటీసీ నందికొండ రామేశ్వరీమట్టారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

నందికొండ : ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి అన్నారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని కమలా నెహ్రూ ఏరియా దవాఖానను మంగళవారం ఆయన సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. హిల్‌కాలనీ విజయవిహార్ సమీపంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పుష్కరఘాట్ వద్ద వినాయ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట దవాఖాన సీఎంఓ భానుప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, వైస్ చైర్మన్ ఆదాసు నాగరాణీవిక్రమ్, కౌన్సిలర్ ఇర్ల రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సాయుధ పోరాటాన్ని వక్రీకరించడం తగదు : సీపీఐ


దేవరకొండలో మాట్లాడుతున్న పల్లా దేవేందర్‌రెడ్డి

మిర్యాలగూడ, సెప్టెంబర్ 10: భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని బీజేపీ హిందూ, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా వక్రీకరించడం సరికాదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మల అమరత్వంతో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డిల పిలుపుమేరకు ప్రజలు నైజాంకు వ్యతిరేకంగా పోరాటం సాగించారన్నారు. సమావేశంలో ధీరావత్ లింగానాయక్, అంజనపల్లి రామలింగం, ఫహీం, లింగంపల్లి సైదమ్మ, మామిడి మార్తమ్మ, దుర్గమ్మ, వెంకటయ్య, రాములు, రహీం పాల్గొన్నారు.

చందంపేట : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం దేవరకొండలో నిర్వహించిన పార్టీ చందంపేట మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13 నుంచి 17 వరకు జరిగే వారోత్సవాల్లో ప్రజలు అధికంగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి వెంకటయ్య, నాయకులు రామస్వామి ఆంజనేయులు, వెంగలయ్య, శేఖర్‌రెడ్డి, బైరెడ్డి కృష్ణయ్య, లాలయ్య, దేవీలాల్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు యడవెల్లి విద్యార్థి

కార్తీక్

నల్లగొండ సిటీ, సెప్టెంబర్ 10 : కనగల్ మండలం జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల విద్యార్థి కె.కార్తీక్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దొడ్డి విజయలక్ష్మి, పీడీ నారాయణ కవిత తెలిపారు. ఈ నెల 14 నుంచి 16 వరకు వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో కార్తీక్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కార్తీక్‌ను అభినందించారు.